# పాత జీవితానికో క్రొత్తమలుపు



జొడిగుంట రామచంద్రమూర్తి

'బావా!...

ఇన్నేళ్ళతరువాత నేనిలా ఉత్తరం వ్రాస్తానని నువ్ కలలో కూడా ఊహించి వుండవు! కానీ వ్రాయాలని నేను చాలా కాలంగా అనుకుంటున్నాను ... అయితే నువ్వెక్కడున్నదీ ఎంత ప్రయత్నించినా తెలియలేదు...నిన్ను ప్రమోషన్ మీద హైదరాబాదు వేసినట్లు—ఈమధ్య పేపర్లో చదివాను!... మనస్ఫూర్తిగా ప్రేమించినా—నిన్ను పెళ్ళిచేసుకోలేని నా దౌర్భాగ్యానికి ఇంతకాలం చింతించినా—ఈనాటికి నువ్ ఎక్కడ వుంటున్నదీ తెలుసుకోగలగటమే—నా అదృష్టంగా భావించి—ఈ వుత్తరం వ్రాస్తున్నాను!'

..ఈపాటికి ఈ రాధ ఎవరో పూర్తిగా మరచిపోయుంటావనుకుంటాను ...కానీ...రాజా! నేను మాత్రం నిన్ను మరచిపోలేక పోతున్నాను ... ఏ ఆడదైనా ఒక్కరికే మనసివ్వగలదనే సత్యం — సత్య దూరం కాదని తెలుసుకున్నాను బావా! నిన్ను తలచుకోనిరోజు లేదంటే అతిశయోక్తి కాదేమో!'

'...నేను ఏదో త్యాగం చేయాలనుకొని నా జీవితంలో నిప్పులు పోసుకున్నాను... నేను పూర్తిగా ఓడిపోయాను బావా? కానీ నువ్వయినా ఉన్నతమైన స్థితిలోకి వచ్చి—భార్యా బిడ్డలతో హాయిగా వున్నావని అనుకుంటూ — అప్పుడప్పుడు తృప్తి పడుతూంటాను!... ఈ జీవితానికి ఆ అదృష్టం చాలంటావా?...

'...నీ చల్లని/ఒడిలో తలదాచుకొని—కరువుతీరా కన్నీరుకార్చి — నీ ఔదార్య మాటలతో—నన్ను నేను శాంతింప చేసుకోవాలనుకుంటున్నాను...నాకోసం ఒక్కసారి ఢిల్లీ రాగలవా బావా?...

'...మరచి పోయాను! నీతోబాటు అక్కనూ పిల్లల్నీ కూడా తీసుకొస్తే—చూడాలని నా మనసు ఉవ్విళ్ళూరుతోంది...

నీ రాకకై ఎదురు చూస్తూంటాను...

నీ

రాధ'

ఉత్తరం చదువుతూంటే నా హృదయం బరువెక్కిపోయింది...ఆనాడు రాధ కనుక కొంచెం తెగువ చేసివుంటే—మా యిద్దరి బ్రతుకులూ—మరోలా సాగేవేమో?...

భౌతికంగా—సంఘంలో ఉన్నత మయిన స్థితికి వచ్చినా—మానసికంగా—నేనుకూడా ఓడిపోయాను...ఈ భయంకరమైన నిజం రాధకు తెలియదు...తెలుసుకొని రాధ చేయగలిగిందేమీ లేదుకూడా!

నాలో ఎందుకో — ఒక్కసారి రాధను చూడాలనే బలమైన కోరిక తీవ్రరూపం దాల్చింది...చాలాకాలంగా ఆమెను చూడాలని నేనూ ప్రయత్నించాను...కానీ వీలుపడలేదు ...ఒకసారి మా బంధువు ఒకాయన కనిపించి 'రాధ సింద్రీలో వుంటోంద'ని చెబితే—ఒకనెల రోజులకు ఎలాగో వీలు చేసుకొని అక్కడకు వెళ్ళాను...అప్పటికి వారంరోజులక్రితమే వాళ్ళు 'బిలాసపూర్' వెళ్ళిపోయారని తెలిసింది!... ఆ తరువాత

నాకు అక్కడకు వెళ్ళటాన్కి తీరికే దొరక లేదు...

రాధనుండి వచ్చిన ఉత్తరం చూడగానే నా మనస్సు ఆమెను చూడాలని ఉరకలు వేసింది...మరొక్కక్షణం కూడా ఆలస్యం చేయకూడదనుకొని 'ఎయిర్ పోర్ట్'కు 'ఫోన్' చేసి—ఢిల్లీకి టిక్కట్టు 'రిజర్వ్' చేయించుకున్నాను...

* * *

'ఎయిర్ పోర్ట్'నుండి విమానం బయల్దేరింది. ప్రయాణీకు అందరితోబాటూ నేనూ 'లైఫ్‌బెల్ట్' నడుంచుట్టూ కట్టుకున్నాను. కాలం గడుస్తున్నకొద్దీ నాలో ఆరాటం ఎక్కువ కాసాగింది.

రాధ ఎలావుందో ఇప్పుడు ?

'నీ జడ నల్లత్రాచులా వుంటుంది రాధా!'— అని అస్తమానూ నేను అంటూంటే — రాధ పొంగిపోయేది...నేను వాళ్లింటికి వెడితేచాలు — నా ఎదురుగా కూర్చొని ఎన్నెన్నో కబుర్లు చెప్పేది...

'రాధా! నీకు నిలువుబొట్టు అందంగా వుండదు...చక్కగా గుండ్రని బొట్టు పెట్టుకోకూడదూ ?'— అన్నాను ఒకసారి ఆమె నిలువబొట్టును ఆక్షేపిస్తూ...

ఆతరువాత రాధ నిలువుబొట్టు పెట్టుకోవటం నాకు తెలియదు!

మరోసారి—తన పుట్టినరోజున, తలంటు పోసుకొని కొత్తచీర కట్టుకొని మా యింటికి వచ్చింది...మా అమ్మ వంటింట్లోకి వెళ్లగా చూసి—అక్కడే కుర్చీలో కూర్చొని పత్రిక చదువుతున్న నా దగ్గరిగా వచ్చి—వంగి నా పాదాలకు నమస్కరించింది...

'ఆదేమిటి రాధా?' అన్నాను అర్థం కాక.

'ఇవాళ నా పుట్టినరోజు బావా! నువ్ కాబోయే భర్తవు కదా! నన్ను ఆశీర్వదిస్తావని...' అంది తల వంచుకొనే.

మనసులోనే రాధను మనసారా ఆశీర్వదించాను.

ఆ సంవత్సరమే నేను బి. ఏ. పరీక్ష ప్యాసవటం — వో ప్రయివేటు కంపెనీలో గుమాస్తాగా చేరటం జరిగింది.

'మీ పెళ్ళికి ముహూర్తం పెట్టించమని మామయ్యను అడిగి వస్తాను'—అంది అమ్మ ఒక రోజున.

నేనూ ఆ రోజుకోసమే ఎదురుచూశాను.

నేను పుట్టిన మూడవ ఏటనే మా తండ్రిగారు కాలం చేస్తే—అప్పటినుండీ—మాకున్న మూడెకరాల మాగాణిమీద వచ్చే రాబడితో—జాగ్రత్తగా సంసారాన్ని ఈదుకొస్తూ—అమ్మ నన్ను కళ్ళల్లో పెట్టుకొని పెంచి పెద్దచేసింది. చదువుచెప్పించి సంఘంలో నన్నొక వ్యక్తిగా నిలబెట్టింది. ఉన్న ఒక్కగానొక్క కొడుక్కి పెళ్ళి చేసి—అటువంటి పెద్ద వయస్సులో—కోడలుచేత సేవలు చేయించుకుంటూ—మనవలతో కాలక్షేపం చేయాలని ఏ తల్లి మాత్రం అనుకోదు ?

అందుకే అమ్మ మామయ్యగారింటికి వెళ్ళింది. మామయ్య కూడా అప్పుడు ఆ వూళ్లోనే వుండేవాడు అత్తవారి వైపు నుండి వచ్చిన ఆస్తితో వడ్డీ వ్యాపారం చేస్తూ—అదృష్టం బాగుండి ఆ వూరి పంచాయతీకి ఛైర్మన్ కూడా అయ్యాడు. రాధ ఒక్కతే సంతానం కనుక — ఆమెను గారంతో పెంచి పెద్దచేసి—చదువు చెప్పించాడు.

''రాధని రాజశేఖరానికి ఇవ్వలేనుచెల్లాయ్ వెనక బోలెడంత ఆస్థి — అంతకు మించిన హోదా వున్నవాని కిచ్చి పెళ్ళి చేయాలని నా సంకల్పం. నాకు మగ పిల్లాడయినా—ఆడపిల్లయినా రాధ ఒక్కతే గదా !... దాని సుఖం కోరుకోవటంలో తండ్రిగా—నా స్వార్థముందంటావా చెల్లాయ్ ?' — అని అమ్మని ప్రశ్నించాడు మామయ్య...

మామయ్య మాటలకు అమ్మ నిశ్చేష్టురాలయింది...కొన్ని క్షణాలకు తేరుకొని—

'ఇప్పుడు రాజాకి మాత్రం ఏం లోటొచ్చిందీ అన్నయ్యా? బి. ఎ. ప్యాసయి ఉద్యోగంలో కూడా చేరాడు! ఇక ఆస్తిపాస్తులంటావా ? రేపు వాడు మాత్రం సంపాదించడా ? అయినా గుణం ప్రధానం కానీ డబ్బు ఏం చేస్తుంది?... వాడికి రాధంటే ప్రాణం అన్నయ్యా!'— అన్నది...

'నిజమే చెల్లాయ్! నేను కాదనను... రాధను చేసుకునే హక్కు మేనల్లునిగా—రాజశేఖరానికి ఉన్నదన్న యదార్థాన్ని నేను మరచిపోలేదు...కానీ రాధ భవిష్యత్తు గురించి నేను కన్నకలలు వేరు చెల్లాయ్! అది వో పెద్దింటికి కోడలిగా వెళ్ళాలి! అడుగులకు మడుగులొత్తే పనివాళ్లుండాలి! కారులో షికార్లకు తీసుకవెళ్లే హోదాకల భర్త కావాలి !...

'ఒంటరి బ్రతుకులూ - గుమాస్తా జీతాలూ—ఇంటెడు చాకిరీ—ఇవ్వన్నీ నాకు ఇష్టం వుండవు చెల్లాయ్! నా బాధ అర్థం చేసుకో! నేను అంతకన్నా ఎక్కువగా చెప్పలేను!... అలా అని రాజశేఖరమంటే నాకు దురభిప్రాయముందని మాత్రం అనుకోకు !'— అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు మామయ్య...

ఇంటికి వచ్చిన అమ్మ ఈ విషయమంతా చెప్పి—కళ్ల నీళ్లు పెట్టుకొంది ...ఒకరక్తం పంచుకొని పుట్టిన అన్నా చెల్లెళ్ల మధ్య వుండే అనురాగాలింతేనా అనుకున్నాను ... మామయ్య ప్రవర్తన నాలోని అభిమానాన్ని రెచ్చగొట్టింది...

కానీ రాధ !

రాధను నేను ప్రేమించాను...

ఆమె మరొకరి అర్థాంగిగా వెళ్లిపోతుందనే ఊహ కలిగితే చాలు—నాలోని నరనరాలూ కృంగిపోతాయి !

ఆ మర్నాడే రాధను కలుసుకున్నాను... 'నీ నిర్ణయం కూడా అంతేనా రాధా ?' అని అడిగాను...

ఆమె బదులు చెప్పలేదు...కానీ ఆమె కళ్లలో నీరు మెరవటం నేను చూశాను...

'బావా! నన్ను మరచిపోలేవా ?'— అని అడిగింది రాధ కొన్నిక్షణాల తరువాత.

'అయితే నన్ను మరచి నువ్ ఉండగలవన్నమాట !' అన్నాను కొంచెం ఉద్రేకంతో...

'ఉండాలని ప్రయత్నిస్తాను బావా! కాలమే సమస్యల్ని పరిష్కరిస్తుందంటారు! కొన్నాళ్ళు బాధగానే వుంటుంది. నాకూ ఒక సంసారమూ, పిల్లలూ—అంటూ ఏర్పడితే — నిన్ను మరచిపోవటం కష్టం కాదేమో? మన వయస్సు పాలపొంగు లాంటిది బావా! ఎవరూ గమనించకపోతే పాలు పొంగి పొర్లిపోతాయి. కాదని కాసిని నీటి చుక్కలు చల్లితే చప్పున చల్లబడిపోతాయి.'

రాధ మాటలు నాకు వింతగా తోచాయి.

'నీమీద నేను ఎన్నో ఆశలు పెట్టుకున్నాను రాధా!'

'నామీద నాన్నగారు కూడా కొండంత ఆశ పెట్టుకున్నారు బావా! నీవు తోడులేనిదే నే నుండలేనని నాకు తెలుసు. కానీ ఈ జన్మ ఇచ్చిన పెద్దవాళ్ళ ఆశలు తీర్చ

...లో వున్న త్యాగం— స్వార్థంతో వాళ్ళకి అన్యాయం చేయటంలో లేదనుకుంటాను!'

'హు! త్యాగం! స్వార్థం! అంత పెద్ద మాట లెందుకులే రాధా! ఏది స్వార్థమో ఏది త్యాగమో నాకు బాగా తెలుసు!... వస్తాను!' అంటూ ఆమె ఏదో చెప్పబో తున్నా వినిపించుకోకుండా అక్కడి నుండి ఇంటికి వచ్చేశాను.

'ఏమిటి సార్! పాలెం ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగి చాలా సేపయింది. మీరింకా ఆలోచిస్తూనే కూర్చున్నారు' — అంటూ నా దగ్గరగా వచ్చి పలకరించింది 'ఎయిర్ హోస్టెస్'. నేను ఆలోచనల నుండి తేరు కొని నా సూట్‌కేసు తీసుకొని విమానం దిగాను...రాధ ఇచ్చిన చిరునామా చూసు కొని టాక్సీని పిలిచాను.

* * *

మరో అర గంటకు రాధ ఇంటిముందు టాక్సీ ఆగింది. అదొక చిన్న డాబా. చుట్టూ సువిశాలమైన కాంపౌండు! గేటు తీసుకొని లోపలకు అడుగు పెట్టాను. తోట మాలి కాబోలు, గులాబీ మొక్కలకు నీరు పెడుతున్నాడు. రాధకి గులాబీ పువ్వులంటే ప్రాణం! అందుకే ననుకుంటాను తోట నిండా గులాబీ మొక్కల్ని నాటించింది. అంతలోనే తోటమాలి నా దగ్గరకు వచ్చి 'ఎవరు కావాలి బాబూ?' — అని ప్రశ్నిం చాడు.

'రాధమ్మగార్ని చూడాలి!' అన్నాను.

'హాలులోనే కూర్చున్నారు వెళ్ళండి బాబూ!'— అంటూ మళ్ళీ తనపనిలో లీనమై పోయాడు తోటమాలి...

హాలులో మధ్యన నాలుగు సోఫాలు అమర్చి వున్నాయి... వాటిమధ్యన వున్న 'రోజ్‌వుడ్ టీపాయ్' మీద 'ఫ్లవర్ వేజ్' అందంగా కనిపిస్తోంది. సోఫాలో కూర్చొని ఏదో 'సేను' అల్లుతోంది రాధ...

'రాధా!'— పిలిచాను...

ఆమె తలెత్తి చూసింది...ఆ పెను బాధగానే నా కాళ్ళ కింద నేల కరిగి పోతున్నట్లనిపించింది...

'బావా! నువ్వా?... నాకు తెలుసు నువే వస్తావని!... రా బావా!' అంటూ గబగబా నాదగ్గరకు వచ్చి నాచేయి పట్టు కొని తీసుకెళ్ళి సోఫాలో కూర్చో బెట్టింది. ప్రక్కనే వున్న 'ఫ్రిజ్' లోంచి

# పాతజీవితానికో...

బత్తాయిరసం తీసి — గ్లాసులో పోసి యిచ్చి—నా కెదురుగావున్న కుర్చీలో కూర్చొంది...అంతవరకూ ఆమె ప్రతి చర్యనూ గమనించటం తప్ప ఏమీ మాటాడ లేక పోయాను...

ఇన్నేళ్ళకు నన్ను చూసిన సంతో షంలో కాబోలు—ఆమె కళ్ళు ఆనందంతో వర్షిస్తూంటే — దాచుకోవాలని విశ్వ ప్రయత్నం చేసింది...

'నిన్ను ఇలా చూడవలసి వస్తుందను కోలేదు రాధా!'— అన్నాను.

రాధ మాట్లాడలేదు...

'ఈ ఘోరం ఎప్పుడు జరిగింది రాధా?'— అని అడిగాను మళ్ళీ...

'అప్పుడే పదేళ్ళు కావస్తోంది బావా!

## ఓం నమః శివాయ

కం. వనిత వృద్ధనై గ్రహింపనన్న
వాక్చాతుర్యతతో వర్ధిల్లు నేను
కొంటిన్
విపరీత వ్యంగ్య విమర్శన
పిచికలో విసిగి వేసారితి వికలనై.

కం. వుందు గ్గైకొందు ని సేవన్
వ్రాహాకోకమే స్థాపింతు స్థిరము
గన్
వృషభుడే దీవించున్
వ్రాధాకాంక్షేపనొల్ల, నటరాజా.

కం. ఖేదుక్కొందు, వెంబడింతు నిన్నే
వేకువ జాముననే సేతు ని జపము
వైరివిగాదు, ధురంధరా
వాకరినివేడ, ఎవరిని పొగడ నీ
వుండగన్.

కం. వోర్తు, నేర్తు, చేకూర్తు
హాసేనా పఠింతు, భజింతు, భువన
గిరినే
వందన సహ నమర్పింతు
వః వహా విశ్వస్పష్టి కర్తస్వయంభూ
ఎంభుడే.

—రచయిత్రి : శ్రీమతి సరస్వతిగిరి

'హార్ట్ ఎటాక్' వచ్చి పోయారు...నా జీవి తంలో—నాకన్నీ ఎదురుదెబ్బలే తగిలాయి బావా!... నేను ఇంకా ఎలా బ్రతికి వున్నానా అనిపిస్తుంది అప్పుడప్పుడు—' అంటూ కళ్ళనీరు పెట్టుకొంది రాధ...

'ఊరుకో రాధా!'— అన్నాను ఎలా ఓదార్చాలో తెలియక...

'ఇంతకీ అక్కనీ — పిల్లల్నీ — తీసుక రాలేదా?'— అని ప్రశ్నించింది — మరి కొన్ని క్షణాలకు కళ్ళు ఒత్తుకుంటూ...

'ఒకర్ని ప్రేమించి మరొకరితో కాపురం చేయగల ధైర్యం నీకయితే వుంది కానీ— నేనావని చేయలేక పోయాను...నేను పిరికి వాణ్ణి రాధా!'— అని ఆమెవైపు చూశాను...

రాధ ఒక్కసారిగా త్రుళ్ళిపడింది.

'అయితే నువ్ అసలు పెళ్ళి చేసుకో లేదా?'

'ఎలా చేసుకుంటా ననుకున్నావ్? ఒక నాడు నా సర్వస్వం నువ్వే నమకొని — నిన్ను భార్యగా ఊహించుకున్నాను. ఆ స్థానంలోకి మరొకర్ని తీసుకొచ్చి—ఆమెను ఎలా సుఖపెట్టగలను రాధా?... అందుకే నేను పెళ్ళి చేసుకోలేదు.'

'నువ్వంటున్నది నిజమేనా బావా? ఇన్నాళ్ళూ నాకు నేనే మోసం చేసుకున్నానని అనుకున్నాను. నావల్ల నువ్ కూడా మోస పోయావన్న మాట! ఇలా జరుగుతుందను కోలేదు బావా!'—అంటూ తల వంచుకొంది రాధ.

మా యిద్దరి మధ్యా కొన్ని క్షణాలు మౌనంగా దొర్లిపోయాయి.

'ఇంతకీ నీ పిల్లలు కనిపించరేం?' అని ప్రశ్నించాను—నిశ్శబ్దాన్ని భరించలేక.

'బహువచనం వద్దులే! పుట్టింది ఇద్ద రయినా—నాకు మిగిలింది ఒక్కడే! నీ పేరే పెట్టాను వాడికి...రాజశేఖరం! ... ఇక్కడ 'లీడింగ్' డాక్టరు!' ఇంకా పెళ్ళి చేయాలి. ఏదో కాన్ఫరెన్సంటూ కలకత్తా వెళ్ళాడు. నాలుగు రోజుల్లో వస్తాడు...'

రాధ అలా మాట్లాడుతూంటే—ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాను... వయసు పెరిగినా—మనసు పెరగని రాధ నామీది మమతను త్రుంచుకోనలేక — తన కొడుక్కి నా పేరు పెట్టుకొంది.

'ఏం బావా? అలా చూస్తున్నావ్?

గుండ్రని బొట్టు నా ముఖానికి అందం తెస్తుందనేవాడివి!...ఆ అందం నా నుంచి శాశ్వతంగా దూరమయి పోయిందని ఆలో చిస్తున్నావా?' – అన్న రాధ మాటలకు ఉలిక్కిపడ్డాను.

'ఏం బావా! అలసిపోయినట్లున్నావ్ !... స్నానం చేసి వస్తే భోజనం చేద్దాం...' అంటూ లేచింది రాధ.

నేను భోజనం చేస్తున్నంతసేపూ — మాచిన్నప్పటి సంఘటనలు గుర్తుచేస్తూనే వుంది.

'నన్ను పెళ్ళి చేసుకొని వుంటే నువ్వింత అభివృద్ధిలోకి వచ్చేవాడివి కాదు బావా!' అంది రాధ అన్నం వడ్డిస్తూ.

'కావచ్చు! నేను భౌతికంగా ఇంత అభి వృద్ధిలోకి వచ్చినా—మానసికంగా పతనమై పోయాను రాధా! దానికి కారణం నువ్వేనని నాకు తెలిసినా—ఆ తప్పు – నన్ను పుట్టిం చిన దేవుడిమీదకు త్రోసేసి – తృప్తి పడు తూంటాను అప్పుడప్పుడు!'

'నిజమే బావా! నన్ను క్షమించు'–రాధ కళ్ళలో నీరు చిప్పిలటం నేను గమనిస్తూనే వున్నాను.

రాధ మళ్ళీ అంది...

'నేను అనుకొన్న దొకటయితే మరొకటి జరిగింది. ప్రపంచంలో ఎంతమందో ప్రేమించుకుంటున్నారు. కానీ అందులో కొందరే పెళ్ళి చేసుకునే అదృష్టాన్ని పొందగలుగుతున్నారు. మిగిలినవాళ్ళు తమ ప్రేమ విఫలమయిందని జీవితాంతం కుమిలి పోతూ తమ బ్రతుకుల్లో నిప్పులు పోసు కుంటున్నా రంటావా బావా? ప్రేమించిన వారిని పెళ్లి చేసుకునే అవకాశం లేని ఎంత మంది మరొకరితో హాయిగా జీవించటం లేదు?...

'...అందుకే నిన్ను ఎంతగానో ప్రేమిం చిన నేను—నాన్నగారి కోరికమీద మరొకరి అర్థాంగినయ్యాను. నన్ను అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసి — నా సుఖ సంతోషాలు కోరుకున్న తల్లిదండ్రుల కోరిక తీర్చటం కోసం ఆనాడు మన ప్రేమను త్యాగం చేశాను బావా!...కాల ప్రవాహంతోబాటు – తీయని మన వలపుల తలపులు కూడా కొట్టుకపోతాయనుకున్నాను ...

'...కానీ...నేను మోసపోయాను బావా! పూర్తిగా మోసపోయాను. వారి సాన్ని ధ్యంలో వుండే అనుక్షణమూ నాకు నువ్వే జ్ఞాపకానికి వచ్చేవాడివి! భార్యగా ఆయనను సుఖపెట్టలేకా—మనస్ఫూర్తిగా ప్రేమించిన నిన్ను మరచిపోలేకా – అడుగడుగునా నేను నరక యాతన అనుభవించేదాన్ని ... పవిత్ర మయిన ప్రేమ విలువ ఏమిటో నాకు తెలి సింది బావా!'–రాధ చెప్పటం మాని కన్నీరు తుడుచుకుంది...'

'ఇవాళ తృప్తిగా భోజనం చేశాను రాధా– నా జీవితానికి ఇవాళ నిండుతనం వచ్చి నట్లు 'ఫీల'వుతున్నాను'—భోజనం ముగిం చిన తరువాత హాలులోకి వచ్చి అక్కడ సోఫాలో కూర్చుంటూ అన్నాను.

'ఎవరో ఒకర్ని పెళ్లిచేసుకొని వుంటే ప్రతిరోజూ తృప్తిగానే తినేవాడివేమో ?' —అంది రాధ చిన్నగా నవ్వుతూ...

'ఏమో రాధా! మొదట నాకా ఉద్దే శ్యమే కలగలేదు...తరువాత కొన్నాళ్ళు అవకాశం దొరకలేదు...మరి కొంతకాలానికి అవసరంకూడా లేకుండా పోయింది. ఇక ఇప్పుడంటావా ?... రేపో మాపో 'రిటైర్' అయిపోవటానికి సిద్ధంగా వున్నాను...నాకు పిల్ల నెవరిస్తారు చెప్పు ?'— అన్నాను నేనుకూడా నవ్వుతూ !

ఈసారి రాధ బదులు చెప్పలేదు !

'ఆనాడు మామయ్య అమ్మదగ్గర అన్న మాటలు నాలోని అభిమానాన్ని రెచ్చ గొట్టాయి రాధా !... ఏటువంటి అంతస్తూ—హోదా–గలవాణ్ని తెచ్చి నీకు చేయాలను కున్నాడో—అంతకు మించిన ఐశ్వర్యాన్ని పొందాలని నిశ్చయించుకొని— అహోరాత్రాలూ–అందుకు కృషిచేశాను...

'ఒక మిత్రుని సహాయంతో ఎమ్మే పరీక్ష కట్టాను...అది ప్యాసయిన తరువాత 'ఐఎయస్'కి కూడా వెళ్ళాను.

'...అప్పట్లో అమ్మ—పెళ్లిచేసుకోమని పోరు పెడితే—రెండు మూడు సంబంధాలు చూశాను...పందెంలో లక్ష రూపాయలు పోగొట్టుకున్నవానికి ఒకరూపాయి దొరికితే ఏం తృప్తిపడగలడు ?... నా పరిస్థితి కూడా సరిగ్గా అలాగే అయింది. నన్ను ప్రేమించి, నీకు మనసిచ్చిన నేను మరొ కర్ని ఆ దృష్టితో చూడలేక పోయాను... పెళ్లి చేసుకున్నా—ఆమెను సుఖపెట్ట



లేక—అన్యాయం చేసినవాణ్ణి అవుతానను తున్నాను...

'...ఆ తరువాత కొన్ని సంవత్సరాలకే అమ్మకూడా—నన్ను వదిలి వెళ్లిపోయింది! ...నేను ఏకాకిని !... ఉద్యోగరీత్యా చాలా ప్రదేశాలు తిరిగాను...పెద్ద పెద్ద వాళ్లంతా నాకు స్నేహితులు! ఉన్న బాధల్ని మరచి పోవటాన్కి—వాళ్లతో కలిసి — లేని అల వాట్లు నేర్చుకున్నాను...ఎటువంటి సుఖా న్నయినా డబ్బుతో పొందవచ్చనీ—ఎంతటి సంతోషాన్నయినా—బజారులో కొనవచ్చనీ తెలుసుకున్నాను...అందుకే పెళ్లి చేసుకునే అవకాశం—అవసరం—నాకు కలగలేదు'— అన్నాను నేను...

'చాలు బావా ! ఇంక చెప్పకు...నీ పత నానికి కారణం నేననే ఊహ నాలో కలగ నివ్వకు! అది నేను భరించలేను'—అంటూ గబగబా—తన గదిలోకి వెళ్లిపోయింది రాధ...

రాత్రి తెల్లవార్లూ ఆమె గదిలో దీపం వెలుగుతూనే వుంది...మధ్య మధ్య—ఆమె ఏడుస్తున్నట్లు—సన్నని ఎక్కిళ్లు కూడా

# పాతజీవితానికో...

వినిపించాయి...కానీ ఆమెను వోదార్చే శక్తి లేదు నాకు!

* * *


ఒక రాత్రివేళ ఏదో చల్లని స్పర్శ తగిలి—మెలకువ వచ్చి చూశాను! నా కాళ్లదగ్గర రాధ కూర్చొనివుంది... ప్రక్కనేవున్న 'బెడ్‌స్విచ్' నొక్కాను... తెల్లని వెలుతురు గదంతా పరచుకుంది...

రాధకళ్లు ఎర్రగా—వాచిపోయి వున్నాయి

'ఏమిటి రాధా! ఏడుస్తున్నావా ?'—నా ప్రశ్న ఆమెను వోదార్చటానికి బదులు—మరింత క్రుంగదీసింది...హటాత్తుగా వచ్చి—నా గుండెలమీద వాలిపోయి చిన్న పిల్లలా ఏడ్చింది.

వోదార్చటానికి నా గొంతునుంచి మాట పైకి రాలేదు...నా పరిస్థితి కూడా దాదాపు అలాగే వుంది...

'తెల్లవారేవరకూ నీ చల్లని ఒడిలో ఇలా తలదాచుకొని కన్నీరు ఇంకి పోయేలా నన్ను ఏడ్వనీయ్ బావా'— అంది రాధ...




'ఊరుకో రాధా! మరీ చిన్నపిల్లలాగా ఏమిటిది ?'— ఎలాగో గొంతు పెగల్చు కొని అన్నాను...

'నాకు వో సహాయం చేయగలవా బావా?'—లేచి కళ్లు తుడుచుకొని—ఒక నిర్ణయా నికి వచ్చినదానిలా—ప్రశ్నించింది...

'నామీద నీకా నమ్మకం లేదా రాధా?'

'ఉంది బావా! అందుకే అడుగు తున్నాను...నన్ను నీతో తీసుకపో!'

రాధా!'...నేను అదిరిపడ్డాను...

'నిజమే బావా! నేను నీతో వచ్చే స్తాను! ఒకనాడు ప్రేమించిన ప్రియురాలి గానూ—నీ యింటికి యిల్లాలిగానూ కాదు! కేవలం ఒక స్నేహితురాలిగా నీ సన్నిధిలో నా కింత చోటివ్వు బావా! నువ్వుకూడా పెద్ద వాడివై పోయావు! ఈ వయసులో నీకు సేవ చేయటానికి— ఎలాగా— ఒక మనిషి కావాలి ... ఆ సేవ నేను చేస్తాను! ... మనిద్దరం ఒకరికి ఒకరుగా — ఈ ఆఖరి రోజుల్ని గడుపుదాం...

'...ఒకనాడు నేను చేసిన త్యాగం నీ జీవితాన్ని నాశనం చేసింది... ఈనాడు మళ్లీ నేను చేస్తున్న ఈ త్యాగం నాకు మనశ్శాంతి నిస్తుంది ... ఈ అవకాశాన్ని నాకు ప్రసాదించు బావా!'— రాధ మాటలు చాలా దృఢంగానూ నిశ్చయంగానూ వున్నాయి.

నాకు మాత్రం అంతకన్నా కావలసిన దేముంటుంది? అందుకే రాధతో అన్నాను—

'బ్రతుకుబాటలో నేనొక దారితప్పిన ప్రయాణీకుడ్ని రాధా! నా పాత జీవి తానికి— వో మంచి మలుపు ప్రసాదిస్తానని నువ్వంటే కాదంటానా? పతనమయిపోతున్న నా బ్రతుక్కి వ్యక్తిత్వాన్ని ప్రసాదించు రాధా'— అన్నాను ఆమెను గట్టిగా నా హృదయానికి హత్తుకుంటూ...

* * *

ఆ తరువాత నాలుగురోజులకే నే మిద్దరం ఎక్కిన విమానం హైదరాబాదు వైపు ఎగిరింది. ●